క్లుప్తంగా

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



రేషన్‌షాపులో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

విజయనగరంఫోర్ట్: పూల్‌బాగ్ రేషన్ షాపు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి గురువారం పూల్‌బాగ్ రేషన్ షాపును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఉండాల్సిన బియ్యం నిల్వల కన్నా 50 బ్యాగులు అధికంగా ఉండడం గుర్తించారు. దీనిపై సదరు డీలర్‌ను ఆరాతీయగా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో జి.మురళీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఏపీఎం సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

నెల్లిమర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలానికి చెందిన గ్రామైక్య సంఘాల సహాయకులు, సీసీలు వెలుగు ఏపీఎం సురేష్‌కుమార్‌కు మండల కేంద్రంలో గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో కన్నా ఆన్‌లైన్ సేవలు పెరిగినందున 5జీ స్మార్ట్‌ఫోన్లు, సిమ్‌లు తమకు అందజేయాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఉద్యోగాలను తొలగించవద్దని, కనీస వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్ బకాయిలు చెల్లించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మనూజ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న గోవా గవర్నర్



దర్గాలో పూజలు చేస్తున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: కోటను ఆనుకుని ఉన్న డెంకే షావలీ బాబా దర్గాను గోవా రాష్ట్ర గవర్నర్, మాన్సాస్ సంస్థ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు గురువారం సందర్శించారు. దర్గా వంశపారంపర్య నిర్వాహకులు షేక్ బహదూర్ వారిని ఆహ్వానించి, దర్గా సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి, బాబా ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పాము కలకలం



నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ సాయి

గుర్ల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నాగుపాము గురువారం కలకలం రేపింది. వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందిస్తుండగా ఆస్పత్రిలోకి నాగుపాము రావడంతో సిబ్బంది, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. విజయనగరం నుంచి స్నేక్ క్యాచర్ సాయి వచ్చి నాగుపామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

జామి: మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ, ఏఎస్‌ఏ శాంతి ఆధ్వర్యంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. పంటకోత ప్రయోగాలు ఏ విధంగా చేపట్టాలి.. ఈ పంట నమోదు ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. .

30 వినతుల స్వీకరణ

చీపురుపల్లి: విద్యుత్ సమస్యలకు సంబంధించి నిర్వహించిన పరిష్కార వేదికలో చీపురుపల్లి, గరివిడి మండలాల నుంచి 30 వినతులు వచ్చాయి. పట్టణంలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో విద్యుత్ వినియోగదారులు ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ పరిష్కార న్యాయస్థాన క్యాంప్ కోర్టు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సభ్యులు ఎస్.సుబ్బారావు, సులేఖారాణి వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. లో ఓల్టేజీ, అధిక బిల్లులపై ఎక్కువ వినతులు అందాయి. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోరం చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఈసీఎస్ ఎం.డి సన్యాసినాయుడు, ఏఈ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహార సలహా సంఘాలేవీ?

- కానరాని ఆహార సలహా సంఘాలు
- రేషన్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో జరుగుతున్న మోసాలు



పూసపాటిరేగ తహసీల్దారు కార్యాలయం

పూసపాటిరేగ: రేషన్ పంపిణీలో మోసాలు జరగకుండా ఉండేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఆహార సలహా సంఘాలు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో రేషన్ షాపుల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడి సరుకుల పంపిణీలో మోసాలు జరుగుతున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆహార సలహా సంఘాలుంటే ఎప్పటికప్పుడు తనిఖీలు జరిగి రేషన్ దుకాణాలు సక్రమంగా పనిచేస్తాయని, వినియోగదారులకు కూడా నాణ్యమైన సరుకులు అందివ్వడం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మూడు నెలలకోసారి తనిఖీలు..

రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడడమే ధ్యేయంగా అప్పట్లో ఏర్పాటైన ఆహార సలహా సంఘాలు మండల స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై, రేషన్ పంపిణీపై సమీక్ష నిర్వహించేవి. ఇప్పుడు అసలు అలాంటి సంఘాలే లేకపోవడంతో రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగతున్నాయని, ముఖ్యంగా తూకాలప్పుడు మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

కమిటీలో ఎవరెవరు ఉండేవారంటే..

అప్పట్లో ఆహార సలహా సంఘంలో అధికారులు, వినియోగదారుల సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండేవారు. సంఘ అధ్యక్షుడిగా మండల స్థాయిలో తహసీల్దారు, జిల్లా స్థాయిలో కలెక్టరు, జాయింట్ కలెక్టరు వ్యవహరించేవారు. వీరంతా ఎప్పటికప్పుడు రేషన్ దుకాణాలకు వెళ్లి, వినియోగదారులకు ఏ విధంగా రేషన్ అందిస్తున్నారు.. ఎవరైనా డీలర్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నారా..వారికి నాణ్యమైన సరుకులు అందుతున్నాయన్న అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేవారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీసేవారు. ఇప్పుడు అటువంటి వ్యవస్థ లేకపోవడంతో చాలా మంది మళ్లీ ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేస్తే బాగుణ్ను అని భావిస్తున్నారు.

మండలం	రేషన్ షాపులు	కార్డుదారులు
పూసపాటిరేగ	47	24,175
భోగాపురం	32	18,441
డెంకాడ	42	17,111
నెల్లిమర్ల	42	24,243

నియోజకవర్గంలో 163 రేషన్ షాపులు..

నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 163 రేషన్ షాపులు ఉన్నాయి. ఇవన్నీ పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లో ఉండగా, వీటి పరిధిలో 83,970 రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రస్తుతం రేషన్ షాపులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో వైఎస్సార్ సీపీ హయాం కన్నా ముందు ఉన్న రేషన్ పంపిణీ వ్యవస్థ మాదిరిగానే వినియోగదారులను డీలర్లు మోసం చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సరిగ్గా సరుకులు తూకం వేయడం లేదని, నాణ్యమైన సరుకులు, అందాల్సిన అన్ని సరుకులు అందడం లేదని పలు గ్రామాల వినియోగదారులు చెబుతున్నారు.

ఎండీయూ వాహనాలు ఎత్తివేత..

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అనే నినాదంతో ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటిని ఎత్తివేసి మళ్లీ పాత విధానంలో రేషన్ దుకాణాల వద్దనే రేషన్ తీసుకోవాలన్న నిబంధన తీసుకువచ్చింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, కొండ ప్రాంతాల్లోని గిరిజనులు రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆహార సలహా సంఘాల ఏర్పాటు కూడా ఇంతవరకు జరగకపోవడంతో రేషన్ పంపిణీలో మోసపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో మాదిరి తనిఖీల్లేవ్..

గతంలో మాదిరిగా రేషన్ షాపుల్లో తనిఖీలు లేవు. దీంతో ఒక్కోచోట రేషన్ దుకాణంలో సరుకుల తూకంలో తేడాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయాలి.

ఎం.శ్రీనివాసురావు,
వినియోగదారుడు, పూసపాటిరేగ

'చలో నర్సీపట్నం'కు తరలిన వైఎస్సార్ సీపీ నాయకులు



చలో నర్సీపట్నం కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన చలో నర్సీపట్నం కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో 30 కార్లలో పార్టీ నాయకులంతా నగరంలోని కోలగట్ల నివాసం వద్ద నుంచి బయలుదేరి వెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా జై జగన్ ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు కూటమి ప్రభుత్వం అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ నాయకుడు మారం బాలబ్రహ్మారెడ్డి, బొద్దూరు లక్ష్మణరావు, పిన్నింటి సూర్యనారాయణ, కార్పొరేటర్లు బండారు ఆనంద్, అల్లు చాణక్య, గాదం మురళి తదితరులు ఉన్నారు.

సిరిసహస్రకు జగనన్న ఆశీస్సులు..



సిరిసహస్రను ఆశీర్వదిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విజయనగరం: చలో నర్సీపట్నం కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖపట్నంలో చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆమెను ఆప్యాయంగా పలకరించి, ఆశీస్సులు అందజేశారు. జగనన్న ఇచ్చిన ఆశీర్వచనాలతో మరింత బాగా పనిచేసి, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆమె మురిసిపోయారు.

యువత లక్ష్యం వైపు అడుగులు వేయాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

విజయనగరంఫోర్ట్: యువత తాము నిర్దేశించుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయి చేరుకోగలరని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఎదుర్కోవాల్సిన చట్టపరమైన చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. విద్యాసంస్థ వెలుపల గానీ లోపల గానీ ఎవరైనా ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ర్యాగింగ్‌కు పాల్పడితే రెండేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అలాగే ఖైనీ, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడి, మత్తు పదార్థాలు అలవాటు చేసుకుని జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్15100ను సంప్రదించాలని కోరారు. ర్యాగింగ్ నిషేధానికి ప్రతి విద్యాసంస్థలో ర్యాగింగ్ కమిటీలు ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవీమాధవి తదితరులు పాల్గొన్నారు.

కలరా బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి

విజయనగరం: కలరా వ్యాధి బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఇదే విషయమై ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కలుషితమైన నీరు, ఆహారం వల్ల కలరా సోకే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వండిన ఆహారంపై మూతలు పెట్టుకోవాలని, కాచి వడపోసిన నీటిని తాగాలని తెలిపారు. అలాగే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తినే ముందు చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

'మత్తు'తో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈగల్ టీమ్

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, యువత, విద్యార్థులంతా గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని ఈగల్ టీమ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత చెడు అలవాట్లు, వ్యసనాలకు బానిసలై జీవితాలు చెడగొట్టుకుంటున్నారని, కన్నతల్లిదండ్రులకు తీరని బాధను మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం ఇవ్వాలనుకునే వారు టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు



బుంగవీధిలో మందుబాబుల మధ్య గొడవను ఆపుతున్న పోలీస్

విజయనగరం క్రైమ్: మద్యం తాగి కొట్టుకున్న ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ కనకరాజు గురువారం తెలిపారు. నగరంలోని బుంగ, కొంప వీధులకు చెందిన కొంతమంది యువకులు బుధవారం రాత్రి మద్యం సేవించి వీరంగం సృష్టించారని, ఒకరిపై మరొకరు దుర్భాషలాడుతూ పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. రాత్రి 2 గంటల సమయంలో 112 ద్వారా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం రావడంతో సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ కనకరాజు పోలీస్ బృందంతో కలిసి ఘటన స్థలానికి వెళ్లి, కర్రలతో దాడులకు పాల్పడిన వారిని అడ్డుకున్నారు. అనంతరం స్టేషన్‌కు పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చినా వినకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు.

భీష్మారావుకు అభినందనలు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావును ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు అభినందించారు. విజయనగరం ఉత్సవాల్లో స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆయన సారథ్యంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు దిగ్విజయంగా నిర్వహించి, ఉత్సవాల విజయవంతంలో కీలక పాత్ర పోషించినందుకు గాను ఆయనను అవార్డు, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

విజయనగరం గంటస్తంభం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించిన పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులను జిల్లా పౌరవేదిక ప్రతినిధుల బృందం గురువారం అభినందించారు.

10, 11 తేదీల్లో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్

విజయనగరం అర్బన్: నగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా తగ్గిన పన్ను రేట్లపై వినియోగదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, అందుబాటులోని ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్లు, ఆరోగ్య పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలకు అనుగుణంగానే వాటి అమ్మకాలు ఉంటాయన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి అవకాశాలు

పూసపాటిరేగ: విద్యార్థులకు కల్పిస్తున్న ఇంటర్న్‌షిప్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వృత్తివిద్య కోర్సు సౌభాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య నైపుణ్యాల అభ్యసనలో భాగంగా విద్యార్థులకు ఆటోమోటివ్ ట్రేడ్‌లో ఇస్తున్న ఇంటర్న్‌షిప్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న వృత్తిపరమైన నైపుణ్యాలు బయటపడతాయని, రాబోయే రోజుల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు.

పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచాలి



శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

నెల్లిమర్ల: ప్రతి గ్రామ పంచాయతీలో ఆదాయం ఇచ్చే వనరులు పెంచి, పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో రామకృష్ణరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ గురువారం ఇచ్చారు. పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సమృద్ధిగా పెంచుకోవడం ద్వారా అభివృద్ధి పథంలో పంచాయతీలను నడిపించవచ్చన్నారు. అనంతరం ఏయే చర్యల ద్వారా పంచాయతీల్లో ఆదాయ వనరులు మెరుగుపరచవచ్చన్న విషయాలను రిసోర్స్‌పర్సన్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో వర్షపునీరు, మురుగు ప్రవాహానికి అవసరమైన కాలువల పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నివేదికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఇదే విషయమై నగరంలోని తన కార్యాలయంలో ఎమినిటీస్ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు ప్రధానాంశాలను ఆధారంగా చేసుకుని కాలువల విస్తీర్ణానికి చర్యలు తీసుకోవాలన్నారు. తొలి ప్రాధాన్యం నీటి ప్రవాహానికి అవసరమైన కాలువలకు ఇవ్వాలని, ఆ తర్వాత మురికివాడలు, జనాభా అధికంగా ఉండే ప్రాంతాల్లో కాలువల అవసరాన్ని గుర్తించాలని, చివరిగా శివారు ప్రాంతాలు, విలీన ప్రాంతాల్లో అవసరమైన చోట కాలువల నిర్మాణానికి చొరవ తీసుకోవాలన్నారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం



చీపురుపల్లి రూరల్ :దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఈనెల ఆరో తేదీన న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని సీపీఎం నాయకులు అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఎం నాయకులు గురువారం గరివిడిలో నిరసన తెలియజేశారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.గౌరినాయడు, జె.విశ్వనాథరాజు, సన్యాసినాయుడు, ఎస్.రమణ, సత్యం పాల్గొన్నారు.

న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలా?..



కొత్తవలస: గాంధీనగర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలా అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు అన్నారు. న్యాయమూర్తి గవాయ్‌పై దాడిచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంతో పాటు గాంధీనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సత్యనారాయణ, శ్రీను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి

గంట్యాడ: పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సీడీపీఓ ఉమాభారతి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని నరవ ఏఎంజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బర్గర్లు, పిజ్జాలు, న్యూడిల్స్, చాట్స్ వంటివి ఎక్కువగా పిల్లలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు, ఊబకాయం వచ్చే అవకాశం ఉందన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.